క్లుప్తంగా

విద్యార్థులు వ్యక్తిత్వ నైపుణ్యాలను అలవర్చుకోవాలి



డిగ్రీ కళాశాలలో వ్యక్తిత్వ వికాస కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉదయం జేకేసీ ఆధ్వర్యంలో ఏలూరు సెట్వెల్ అధికారులు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు సమాజంతో సామరస్యంగా వ్యవహరించడానికి కావల్సిన వ్యక్తిత్వ నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు. సెట్‌వెల్ సీఈఓ కేఎస్ ప్రభాకర్ రావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధన దిశగా శ్రమించాలన్నారు. జిల్లా ఉపాధి అధికారి సీ. మధుసూదన్‌రావు, సెట్ వెల్ సూపరింటెండెంట్ జాన్ కెన్నెడీ, జిల్లా పర్యాటక శాఖ మేనేజర్ ఆర్. పట్టాభి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం. రాంబాబు, జేకేసీ కోఆర్డినేటర్ టీవీఎస్ పద్మావతి ప్రసంగించారు.

క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం



సర్టిఫికెట్లు అందుకున్న బాలబాలికలు

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో బుధవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకురాలు కె వాసుకి మాట్లాడుతూ 7 రోజులు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న బీకేఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వర రావు, అధ్యాపకులు కొండా రవి, విశ్రాంతి గ్రంథాలయ అధికారి దొడ్డపనేని రాధాకృష్ణ, రిటైర్డ్ హెచ్‌ఎం ఓ సుబ్బారావు, లిటిల్ ఫ్లవర్స్ స్కూల్ ప్రిన్సిపాల్, బి సత్యవాణి, జూనియర్ కాలేజ్ కెమిస్ట్రీ అధ్యాపకులు పి రాము గ్రంథాలయాల ప్రాముఖ్యత వివరించారు. అనంతరం పలు పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసారు. కార్యక్రమంలో స్థానిక జెడ్పీ స్కూల్ పీడీ ఎంఎస్ శ్రీనివాస్, బీకేఎంయూ నాయకులు పొట్టేలు పెంటయ్య పాల్గొన్నారు.

ఉత్తమ మార్గంలో పయనించాలి

ఏలూరు టౌన్: బాలల బంగారు భవిష్యత్తుకు పునాదులు వేయాలని, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ అన్నారు. ఏలూరు శనివారపుపేట బాలల సంరక్షణ కేంద్రంలో బుధవారం బాలల హక్కుల వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏలూరు డీఎస్పీ మాట్లాడుతూ సమాజంలో అందరికీ ఆదర్శంగా నిలిచేలా విద్యార్థులు విజయాలు సాధించాలని కోరారు. చెడు అలవాట్లు, వ్యసనాలకు బానిసలైతే భవిష్యత్తు అంధకారమవుతుందని, క్రమశిక్షణతో చదువులో రాణించి ఉత్తమ మార్గంలో పయనించాలన్నారు. కార్యక్రమంలో బాలల హక్కుల సంరక్షణ అధికారులు ఉన్నారు.

వేతనాల కోసం వలంటీర్ల ఎదురుచూపు

- 5 నెలలుగా వేతనాలు చెల్లించని ప్రభుత్వం
- వలంటీర్లకు వేతనం రూ.10 వేలు ఇస్తామన్న హామీ నెరవేరని వైనం
- శాసనమండలిలోనూ వాడీవేడిగా చర్చ
- స్పష్టత ఇవ్వని కూటమి ప్రభుత్వం



వార్డు సచివాలయం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): వారంతా చిరు ఉద్యోగులు. నెలకు రూ.5వేల గౌరవ వేతనంతో పనిచేసే స్వచ్ఛంద సేవకులు వారు. వారిపై కూటమి ప్రభుత్వం కన్నెర్ర చేసింది. దీంతో గత ఐదు నెలలుగా వార్డు వలంటీర్లకు వేతనాలు చెల్లించడం లేదు. గౌరవ వేతనంతోనే బతికే చిరుద్యోగులు తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితుల్లో కొట్టు మిట్టాడుతున్నారు. ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో మొత్తం 88,366 ఇళ్లు ఉన్నాయి. మొత్తం రేషన్ కార్డులు 66,075. క్లస్టర్లు 1,484, మొత్తం డివిజన్లు 50 ఉన్నాయి. ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 79 వార్డు సచివాలయాలు ఉండగా వీటి పరిధిలో 1,434 మంది వలంటీర్లు గతంలో పనిచేసేవారు. పేరుకు పదో తరగతి పాసైన వారికి వలంటీర్ల ఉద్యోగం ఇస్తామన్నా గత ప్రభుత్వం హయాంలో ఎక్కువ శాతం మంది డిగ్రీ చదివిన నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో చాలీచాలని గౌరవ వేతనానికే పనిచేసేందుకు ముందుకు వచ్చారు. భవిష్యత్తులో ప్రభుత్వం తమ సేవలను గుర్తించి ప్రాధాన్యత ఇస్తుందనే చిరు ఆశతో ఈ చిరు ఉద్యోగంలో పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు చేరారు. తాజాగా శాసన మండలిలోనూ వలంటీర్లపై బుధవారం వాడీవేడిగా చర్చ జరిగింది.వలంటీర్ల వ్యవస్థపై మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రభుత్వాన్ని నిలదీసినా వారంతా తప్పంతా తమది కాదు గత ప్రభుత్వానిదే అంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఏలూరు నగర పాలక సంస్థలో వలంటీర్ల వివరాలు

మొత్తం డివిజన్లు	50
మొత్తం సచివాలయాలు	79
ఎన్నికలకు ముందు పనిచేసిన వలంటీర్లు	1,434
మొత్తం ఇళ్ల సంఖ్య	88,366
రేషన్ కార్డుల సంఖ్య	66,075

5 నెలలులగా అందని గౌరవ వేతనాలు

గత ప్రభుత్వం వలంటీర్లకు నెలకు రూ.5వేలు అందించేంది.వార్డు వలంటీర్లకు ఇచ్చే గౌరవ వేతనం ఐదు నెలలుగా కూటమి ప్రభుత్వం చెల్లించడం లేదు. దీంతో వారు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తమ బాధలను అర్థం చేసుకుని బకాయిలు చెల్లించాలంటూ వార్డు వలంటీర్లు ముక్త కంఠంతో కోరుతున్నారు.

రూ.10వేల వేతనం హామీ గాల్లోనే

తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్ల వేతనం రూ.10వేలకు పెంచుతామంటూ ఉత్తర కుమార ప్రగల్భాలు పలికిన చంద్రబాబు అధికారం చేపట్టిన తరువాత ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇంత వరకూ వలంటీర్ల వేతన బకాయిలు, నూతన నియామకాలపై ఎటువంటి ప్రకటన చేయలేదు. పెంపుదల మాట అలా ఉంచితే కనీసం గతంలో ఇచ్చే రూ.5వేలు కూడా ఇవ్వకపోవడంపై వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు. తాజాగా ప్రభుత్వ తీరు చూస్తుంటే మొత్తం వ్యవస్థకే మంగళం పాడే పరిస్థితి నెలకొంది.

సేవలకు దూరంగానే వలంటీర్లు

గతంలో వలంటీర్లు తమకు కేటాయించిన 50 గృహాలకు సంబంధించి అన్ని పనులు దగ్గరుండి చక్కబెట్టేవారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకు ఇచ్చే పింఛన్లు దగ్గరుండి తమ పరిధిలోని ప్రజలకు క్రమం తప్పకుండా అందించేవారు. వీటికి తోడు అన్ని ప్రభుత్వ పథకాలను అర్హులకు చేరవేసేందుకు కృషి చేసేవారు. అలాంటి వలంటీర్ల సేవలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం వినియోగించుకోకుండా తమ కార్యకర్తలకు ఆ పనులను అప్పజెప్పింది. కావాలనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియమించిన వలంటీర్లను, వారి సేవలకు దూరం పెడుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తక్షణం వేతనాలు చెల్లించాలి



గ్రామ, వార్డు వలంటీర్లకు తక్షణం వేతన బకాయిలు చెల్లించాలి. ఐదు నెలలుగా వలంటీర్లకు వేతనాలు చెల్లించకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వలంటీర్ల పట్ల సానుకూలంగా స్పందించి వారికి వేతనాలు తక్షణం విడుదల చేయాలి. చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు వలంటీర్ల వేతనాలు నెలకు రూ.10వేలకు పెంచాలి.

– బి.సోమయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు, సీఐటీయూ, ఏలూరు జిల్లా

వలంటీర్లపై కక్ష సాధింపు సరికాదు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చిందనే కారణంతో చిరుద్యోగులపై కక్ష సాధింపు చర్యగా కూటమి ప్రభుత్వం ప్రవర్తించడం సరికాదు. అధికారంలో ఎవ్వరు ఉన్నా ప్రతి ఒక్కరి సంక్షేమం, అభివృద్ధి కోసం పని చేయాల్సిన అవసరం ఉంది. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గతం కంటే మెరుగైన వేతనం ఇచ్చి వలంటీర్లను ఆదుకోవాలి.

– జి.గోపి, సీఐటీయూ నాయకులు, ఏలూరు

రైతుల సమస్యలు పరిష్కరించాలి



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఏపీ రైతు సంఘ నాయకులు

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వం రైతాంగ సమస్యలు తక్షణం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలు పరిష్కరించాలని, ఏపీ రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డేగా ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసిన విధంగా రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 52 లక్షల మంది రైతులు ఉన్నారని, రైతుల సంక్షేమానికి కూటమి ఇచ్చిన హామీ ప్రకారం రూ.10 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలన్నారు. రైతులకు తక్షణం సాగు సాయంగా ప్రభుత్వం రూ.20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కొండేటి బేబి, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య, సీపీఐ ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ళ వరప్రసాద్, ఏలూరు ఏరియా కౌన్సిల్ సభ్యులు నాగం అచ్యుత్, మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.

విశ్రాంత అధ్యాపకుల అసోసియేషన్‌కు నూతన కమిటీ



ఆర్‌సీటీఏ ఏలూరు యూనిట్‌కు నూతనంగా ఎన్నికైన నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విశ్రాంత అధ్యాపకుల అసోసియేషన్ ఏలూరు యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బుధవారం స్థానిక సీఆర్ ఆర్ డిగ్రీ కళాశాల ఆడియో విజువల్ హాల్‌లో అసోసియేషన్ ఏలూరు యూనిట్ సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు షేక్ హుస్సేన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నికల అధికారి ఎన్‌సీ డేనియల్ పర్యవేక్షణలో ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా షేక్ హుస్సేన్, ఉపాధ్యక్షురాలుగా పి. సుబ్బలక్ష్మి, కార్యదర్శిగా ఎల్.వెంకటేశ్వరరావు, కోశాధికారిగా పి. ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులుగా డి.బ్రహ్మేశ్వరి, ఉత్తమ దుర్గ, కే రాణి, ఎన్‌సీ డేనియల్, జీ రాంబాబు, వీరభద్రరావు, ఎం.సంపదరావు, కే శ్రీకాంత్, కే బాలకృష్ణారావు, ఎస్‌వీవీఎస్ ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు హుస్సేన్ మాట్లాడుతూ ప్రభుత్వ, ఎయిడెడ్ విశ్రాంత అధ్యాపకులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆర్‌సీటీఏ రాష్ట్రంలో అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేసిందని అన్నారు. అపరిష్కృత సమస్యలపై ప్రభుత్వంతో చర్చించి పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తామని, సామాజిక సేవా కార్యక్రమాల్లో అసోసియేషన్ సభ్యులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథి, ప్రిన్సిపాల్ కేపీ రామరాజు మాట్లాడుతూ అసోసియేషన్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు కార్యక్రమాల నివేదికను సమర్పించగా, ట్రెజరర్ పీ ఆంజనేయులు ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ అకౌంట్స్ సమర్పించారు.

సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దు



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్సై నాగకల్యాణి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఆధునిక ప్రపంచంలో అరచేతిలో ఇమిడిపోయే సాధనాల వినియోగం వల్ల సైబర్ నేరగాళ్లు చాలా సులువుగా ప్రజలను మోసం చేస్తున్నారని, వారి వలలో పడకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు టూ టౌన్ మహిళా ఎస్సై నాగకల్యాణి పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా ఎస్పీ కే ప్రతాప్‌శివకిషోర్ బాలికలు, మహిళల సంరక్షణ కోసం ప్రత్యేక గస్తీ బృందాలైన అభయ మహిళా రక్షక సిబ్బందిని ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఏలూరు టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ వైవీ రమణ ఆధ్వర్యంలో నాగకల్యాణి, సిబ్బందితో కలిసి బుధవారం స్థానిక ఏఆర్‌డీజీకే హైస్కూల్లో సైబర్ నేరాల నివారణ కోసం పోక్సో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సోషల్ మీడియా వినియోగం అవసరం మేరకు ఉపయోగించుకోవాలని, అపరిచిత వ్యక్తులు పంపించే లింకులను, మెసేజ్‌లను ఓపెన్ చేస్తే వ్యక్తిగత సమాచారం సైబర్ నేరగాళ్లు తస్కరించి ఫొటోలను మార్ఫింగ్ చేసి బెదిరిస్తారన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై ఎస్సై మాట్లాడారు. ఆపదలో చిక్కుకున్నప్పుడు డయల్ 112కు సమాచారాన్ని అందిస్తే పది నిమిషాల వ్యవధిలో పోలీసులు సహాయ సహకారాలు అందిస్తారన్నారు. సమాజంలో జరిగే అసాంఘిక కార్యకలాపాల వివరాలపై పోలీసులకు సమాచారం అందించడం కోసం ఎస్పీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 9550351100కి వాట్సాప్ నంబర్‌ను వినియోగించుకోవాలన్నారు.

పెట్రోల్ పోసుకుని యువకుడి ఆత్మహత్య

- తిరుపతి జిల్లాలో ఘటన
- విచారణకు వెళ్లిన ఏలూరు పోలీసులు
- తిరగబడిన గ్రామస్తులు

ఏలూరు టౌన్: నిందితుడిని గాలిస్తూ వెళ్లిన ఏలూరు జిల్లా పోలీసులకు ఊహించని పరిణామం ఎదురైంది. తాను నేరాలకు పాల్పడటం లేదని.. ప్రశాంత జీవితం కోసం ఊరు వదిలి వచ్చానని.. తాను విచారణకు రానని నిందితుడు చెప్పగా.. స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించి పంపుతామంటూ పోలీసులు అనడంతో తీవ్ర మనస్థాపానికి గురైన నిందితుడు ఆకస్మికంగా ఇంట్లోనే బాత్‌రూమ్‌లోకి వెళ్లి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో గ్రామస్తులు ఉలిక్కిపడి పోలీసులపై తిరగబడిన ఘటన తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామంలో చోటుచేసుకోగా.. ఇందులో ఏలూరు జిల్లా పోలీసుల పాత్ర ఉంది. బాధితుడి కుటుంబం, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ ఎల్‌బీసీ కాలనీకి చెందిన సూర్యప్రభాస్ (20)పై 15 చోరీ కేసులు ఉన్నాయి. అతడికి భార్య హారిక, కుమారుడు ఉన్నాడు. కులాంతర వివాహం చేసుకున్న ప్రకాష్ మూడు నెలల క్రితం తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామానికి కుటుంబంతో కలిసి వెళ్లి జీవిస్తున్నాడు. భవన నిర్మాణ కూలి పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో విజయవాడ, ఏలూరు జిల్లా లక్కవరం ఎస్సై, జంగారెడ్డిగూడెం క్రైమ్ ఏఎస్సై, మరో ముగ్గురు కానిస్టేబుళ్లు సూర్యప్రభాస్ కోసం గాలిస్తూ మంగళవారం వేదాంతపురానికి వెళ్లారు. సూర్యప్రకాష్ ఇంటికి వెళ్లి విచారణకు రావాలని కోరగా.. పోలీస్‌స్టేషన్‌కు రానని చెప్పాడు. అనుమానంతోనే విచారణ చేస్తున్నామని, ఒక్కసారి రావాలని కోరినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్థాపంతో బుధవారం వేకువజామున ఇంట్లో పెట్రోల్ పోసుకుని నిప్పటించుకున్నాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు బయట నుంచి ఇంటి తలుపులు పగులగొట్టి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

పోలీసుల నిర్వాకమేనా ?

పోలీసులు విచారణకు రావాలంటూ ఒత్తిడి చేయటంతో దుస్తులు మార్చుకుని వస్తానంటూ చెప్పిన సూర్యప్రభాస్ పెట్రోల్ పోసుకుని నిప్పు పెట్టుకుని ఆత్యహత్యకు పాల్పడగా.. పోలీసుల నిర్వాకంతోనే ఇలా జరిగిందంటూ గ్రామంలోని ప్రజలు తిరగబడ్డారు. నిందితుడు ఆత్మహత్యకు పాల్పడటంతో వెంటనే రంగంలోకి దిగిన పోలీస్ ఉన్నతాధికారులు సూర్యప్రభాస్ భార్య, కుటుంబ సభ్యులతో మాట్లాడి సెటిల్‌మెంట్ చేసుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా పోలీసులు లేకుంటే తాము కూడా మంటలు అంటుకుని కాలిపోయేవారమని భార్య హారిక చెప్పటం విశేషం.

వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు టౌన్ : మద్యానికి బానిసై కుటుంబానికి దూరమై జీవితంపై విరక్తి చెందిన ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు తూర్పు వీధి గౌరీ దేవి గుడి సమీపంలో నివాసం ఉంటున్న షేక్ సజనకు (37) భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. గోనె సంచుల పనికి వెళ్తూ ఉంటాడు. మనస్పర్థల కారణంగా కొంత కాలం క్రితం అతని భార్య పుట్టింటికి పిల్లలను తీసుకుని వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్న సజన జీవితంపై విరక్తి చెంది మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. బుధవారం ఉదయం ఇరుగుపొరుగు వారు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో అతని తల్లి షేక్ వకలాబి ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉత్సాహంగా భగవద్గీత పోటీలు



భగవద్గీత కంఠస్థ పోటీల్లో పాల్గొన్న చిన్నారి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన బ్రాహ్మణ ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక శ్రీ కంచి కామకోటి పీఠ హేలాపురి సంస్కృత వేద స్మార్త ప్రయోగ పాఠశాలలో నిర్వహించిన భగవద్గీత కంఠస్త పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భగవద్గీతలోని వివిధ అధ్యాయాల్లోని శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐకాస అధ్యక్షుడు కందుకూరి రవికుమార్, కార్యదర్శి చాత్రాతి మదనమోహన్, కోశాధికారి భోగరాజు ప్రసాద్, మహిళా అధ్యక్షురాలు కొంపెల్ల తాయారు, పరీక్ష నిర్వహణాధికారి కొడాలి హిమబిందు, పాఠశాల కార్యదర్శి సీతంరాజు సుబ్రహ్మణ్య చక్రధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జోస్యుల వెంకట సూర్య జయేంద్ర శర్మ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై నిరసన



ఆర్టీసీ ఏలూరు డిపో గ్యారేజ్ వద్ద నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు

ఏలూరు (ఆర్‌ఆర్ పేట): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఏలూరు డిపో వద్ద ఆర్టీసీ ఉద్యోగులు బుధవారం గేట్ మీటింగ్ నిర్వహించిన నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్‌బీ అనిల్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ సుందరయ్య మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి గోపి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి టీపీఆర్ దొర, జిల్లా కార్యదర్శి ఎస్. సురేష్, డిపో అధ్యక్ష, కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తగదు

ఏలూరు (టూటౌన్): విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే నిలుపుదల చేయాలని, విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రైతులు, ప్రజల విద్యుత్ స్మార్ట్ మీటర్లు రైతులు, ప్రజలకు శాపంగా మారుతాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు ముందుగా ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, ప్రస్తుతం చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహా అందరికీ స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని తెలిపారు. నివాస గృహాలకు, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం కొనసాగిస్తున్నారని అన్నారు. ఉచిత విద్యుత్తుకు ఎసరు పెట్టేందుకే పంపు సెట్లకు మీటర్లు బిగిస్తున్నారని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి ఈ మీటర్లను కొనసాగించడం గర్హనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేయాలని, స్మార్ట్ మీటర్లు ఆపాలని, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని రవి డిమాండ్ చేశారు.

రజకులకు చెరువులు కేటాయించాలని వినతి



జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధకు వినతిపత్రం అందజేస్తున్న కట్లయ్య

ఏలూరు (టూటౌన్) : రజకుల సంక్షేమం, అభివృద్ధి కోసం గతంలో ప్రభుత్వాలు ఇచ్చిన జీవోలను అధికారులు తక్షణం అమలు చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కోరారు. స్థానిక జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ముఖ్య నాయకులు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో దాదాపు 996 గ్రామాలుండగా వీటిలో ఇప్పటి వరకు కేవలం 200 గ్రామాల్లోనే రజకులకు వృత్తి చెరువులను కేటాయించారన్నారు. ప్రతి గ్రామంలో రజకులు వృత్తి నిర్వహించేందుకు చెరువును కేటాయించాలని కోరారు. చెరువుల ఆక్రమణలను తొలగించాలని కోరారు. రజక సంఘం ముఖ్య నాయకులతో కలిసి కట్లయ్య జిల్లా పంచాయతీ అధికారిని కలిసి సమస్యలపై వినతిపత్రాన్ని అందజేసారు.

కరాటే బ్లాక్‌బెల్ట్ సాధించిన పోలీస్ స్కూల్ విద్యార్థి



బాలుడిని అభినందిస్తున్న ఏలూరు జిల్లా ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్ : ఏలూరు అమీనాపేట సురేష్ చంద్ర బహుగుణ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి జి.జయనాగ మహేందర్ కరాటే పోటీల్లో బ్లాక్‌బెల్ట్ సాధించి సత్తా చాటాడు. కృష్ణా జిల్లా విజయవాడలో ఈనెల 17న చేపట్టిన కరాటే పోటీల్లో ప్రతిభ చూపి బ్లాక్‌బెల్ట్ సాధించాడు. ఈ నేపథ్యంలో ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ పోలీస్ స్కూల్ విద్యార్థి మహేందర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు మహేందర్‌ను ఆప్యాయంగా పలకరిస్తూ అభినందించారు. సురేష్ చంద్ర బహుగుణ స్కూల్ హెచ్‌ఎం స్రవంతి, ఆర్ఎస్ఐ నరేంద్ర, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సీఆర్ఆర్ విద్యార్థుల రక్తదానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : నగరంలోని సీఆర్ రెడ్డి కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్స్ 1–2, ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అటానమస్ కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణు మోహన్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ కేపీ రామరాజు పర్యవేక్షణలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు 50 యూనిట్ల రక్తదానం చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ఎండీ ఎం భాషా, బి. శంకర్, ఇండియన్ రెడ్ క్రాస్ ఏలూరు జిల్లా విభాగం వైద్యుడు వరప్రసాదరావు, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని వివిధ విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల వార్షిక మరమ్మతులు నిమిత్తం ఈ నెల 22న నగరంలోని ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేద్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. మాధవపురం 11 కేవీ ఫీడర్ పరిధిలోని మాధవపురం, పాలగూడెం, ఎస్సీ కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలో కోటదిబ్బ, మెయిన్ బజారు, పాండురంగ థియేటర్ ప్రాంతం, అగ్రహారం, వన్ టౌన్ మార్కెట్ ప్రాంతం, కెనాల్ రోడ్డు, సత్యనారాయణ పేట, లంబాడీ పేట, వెన్నవల్లివారి పేట, బావిశెట్టివారి పేట, నల్లదిబ్బ ప్రాంతాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.